7

సాక్షి మహబూబాబాద్

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



మార్కెట్లో రైతుల గోస

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు వాటిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

- 8లో▸



బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్ రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.5°/24.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



మహబూబాబాద్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా నవీన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసంతో పాటు సామాజిక అవగాహన పెంపొందించేందుకు గ్రంథాలయాలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మరిపెడలోని శివాలయం అర్చకుడు రఘురాం శర్మ పోటీపరీక్షల పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు నిమ్మ శ్రీనివాస్, పెద్ది సైదులు, సిబ్బంది విజేందర్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు

తిరుగు ప్రయాణం..



డోర్నకల్: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి మిర్చి తోటల్లో పని కోసం వచ్చిన కూలీలు స్వస్థలాలకు తిరిగి వెళ్తున్నారు. గురువారం డోర్నకల్ రైల్వేస్టేషన్ కూలీలతో నిండిపోయింది. కాగా మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాలోని మిరప తోటల్లో కాయ కోసే పనులకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి అధిక సంఖ్యలో కూలీలు తరలివచ్చారు. కాయ కోత పనులు పూర్తవడంతో కూలీలు తిరిగి వెళ్తున్నారు. దీంతో ప్రతిరోజు డోర్నకల్ రైల్వే స్టేషన్ కూలీలతో కళకళలాడుతోంది.

చాక్‌పీస్‌పై అంబేడ్కర్ కళాఖండం



కేసముద్రం: అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన సూక్ష్మకళాకారుడు లింగాల నిఖిల్ గురువారం చాక్‌పీస్‌పై అంబేడ్కర్ విగ్రహాన్ని చెక్కాడు. అద్భుతమైన అంబేడ్కర్ కళాఖండాన్ని పలువురు ఆసక్తిగా తిలకించి, నిఖిల్‌ను అభినందించారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల అవకతవకలపై విచారణ

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో పలు అవకతవకలు జరిగినట్లు గ్రామస్తులు రెవెన్యూ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు గురువారం గ్రామంలో విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు 8 బస్సులు

నెహ్రూసెంటర్: హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, జయంతి ఉత్సవాలకు ఆర్టీసీ మహబూబాబాద్ డిపో నుంచి 8 బస్సులు ఏర్పాటు చేశామని మేనేజర్ జె.విజయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నుంచి శుక్రవారం 19బస్సుల్లో ప్రజలు అంబేడ్కర్ జయంతి వేడుకలకు వెళ్లనున్నట్లు చెప్పారు.

అడవి దారికి అడ్డంకులు!

నిధులు మంజూరైనా నిలిచిన పనులు

- ఫారెస్టు అనుమతుల కోసం నిరీక్షణ
- పనులు ముందుకు సాగకుండా కొర్రీలు
- వర్షాకాలం వరకు పూర్తి చేయకుంటే అంతే సంగతులు..
- ఏజెన్సీ ప్రజలకు తప్పని తిప్పలు



పాకాల-కొత్తగూడ రహదారి దుస్థితి

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలోని ఆదివాసీ, గిరిజన గ్రామాలకు మెరుగైన రోడ్ల సౌకర్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేశాయి. అధికారులు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు కూడా అప్పగించారు. తీరా రోడ్డు వేసేటప్పుడు అనుమతుల పేరిట ఫారెస్టు అధికారులు పనులను నిలిపివేస్తున్నారు. దీంతో కాంట్రాక్టర్లు చేతులు ఎత్తేశారు. రోడ్డు వేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ముందుకు సాగని పనులు..

ఏజెన్సీలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం మండలాల్లో రోడ్ల నిర్మాణానికి ఫారెస్టు క్లియరెన్స్ అడ్డంకిగా మారింది. ఏడాదిక్రితం కేంద్ర ప్రభుత్వం నుంచి తీవ్రవాద ప్రాంతాల అభివృద్ధి నిధులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 70కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో మున్నీ నుంచి దుబ్బగూడెం, గుండాలరోడ్డు, పాకాల మీదుగా నర్సంపేట, కొత్తగూడ, భూపతిపేట, కొత్తగూడ, కామారం, పానుగుండ్ల, గంగారం, కొత్తగూడ మొదలైన రోడ్లకు నిధులు కేటాయించారు. ఇందులో కొన్ని రోడ్లు సింగిల్ నుంచి డబుల్ చేయాల్సి ఉండగా.. మరికొన్ని చోట్ల బీటీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలు చేపట్టేలా ఎస్టిమేట్ తయారు చేశారు. ఇందుకోసం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే ఈ పనులు ముందుకు సాగడం లేదు.

పనులకు అడ్డుపడుతున్న ఫారెస్టు అధికారులు..

అటవీప్రాంతంలో చేపట్టే పనులకు ఫారెస్టు అధికారులు అడ్డు పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని పనులకోసం ఫారెస్టు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే స్థానికులకు అవసరాలు, మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు శాఖపరంగా ఎదురయ్యే సమస్యలను జిల్లా అధికారులతో చర్చించాలి. కానీ తమకేమీ పట్టనట్లు.. అసలు రోడ్లు వేయడమే నేరం అన్న విధంగా అధికారులు కాంట్రాక్టర్లను వేధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఫారెస్టు అధికారులతో ఇబ్బందులు పడలేక కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు విడిచిపెట్టి వెళ్లిపోతున్నారు. అదేవిధంగా రోడ్లు బాగుంటే కలప, ఇతర అటవీ ఉత్పత్తులు తరలించడం సులువు అవుతుందనే ఆలోచనతో కూడా ఈ రోడ్లు వేయకుండా అడ్డుపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టి పెడితేనే..

ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు నిధులు ఉన్నాయి. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. పనులు చేస్తే ప్రజల ఇబ్బందులు తొలుగుతాయి. అయితే వచ్చిందల్లా ఫారెస్టు అనుమతుల తిప్పలే.. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి క్లీయరెన్స్ చేయించడమే. దీంతోపాటు చిన్న చిన్న పనులకు ఫారెస్టు అధికారులు అడ్డు రాకుండా చూడడం అనుమతులు వచ్చినా.. కొర్రీలు పెట్టకుండా ఉండేలా ఫారెస్టు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తే కానీ పనులు ముందుకు సాగే అవకాశం లేదు. ఈ వేసవిలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో ఒక్క వర్షం పడిందంటే.. ఇక ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు మైదాన ప్రాంతాలకు రావాలంటే నరక యాతన పడాల్సిందే.

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్ శశాంక



పెద్దవంగరలో ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న మంత్రి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: రాష్ట్రంలో పండిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం మండలంలోని కర్కాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి ప్రారంభించారు. తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రైతు బంధు, రైతు బీమాతో పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. మండలంలోని కర్కాలలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.8.70 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. యాసంగిలో జిల్లాలో 234 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు కేంద్రాలకు తేమలేని ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి రూ.2,060, కామన్ రకానికి రూ.2,040 చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ రమేష్, ఎంపీపీ చిన్న అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, డీసీఓ సయ్యద్ ఖుర్షీద్, డీఎం కృష్ణవేణి, డీఏఓ నర్సింగరావు, పీఏసీఎస్ సీఈఓ మురళి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, తహసీల్దార్ నాగేంద్ర ప్రసాద్, కర్కాల సర్పంచ్ సురేఖ, ఎంపీటీసీ గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం

పెద్దవంగర: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇస్తుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ప్రభుత్వం తరఫున దుస్తుల పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీఏసీఎస్,ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ జ్యోతిర్మయితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి మాట్లాడారు. ముస్లింలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తుందని, హిందూ, ముస్లింల మధ్య మత ఘర్షణలు పెట్టే బీజేపీని నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఏపీఎం నరేంద్రకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, నాయకులు రామచంద్రయ్య శర్మ, నెహ్రూనాయక్, సోమనర్సింహారెడ్డి,ఎంపీటీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనువాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

నెహ్రూసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని, మనువాదానికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక న్యాయం కోసం పాదయాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన పాదయాత్ర ముగింపు సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కులం, మతం పేరుతో ప్రజలు, కార్మికుల్లో చిచ్చుపెడుతుందని విమర్శించారు. దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. జాతీయ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటు పరం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగంలోకి మనువాద సిద్ధాంతాన్ని తీసుకువచ్చి అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, కందునూరి శ్రీనివాస్, గుగులోత్ సరోజ, చింత మౌనిక, స్నేహబిందు, వల్లాల వెంకన్న, తోట శ్రీనివాస్, దాసరి మల్లేషం, మచ్చ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే న్యాయం జరిగేలా చూడాలి



మరిపెడ పీఎస్‌లో మొక్క నాటుతున్న ఎస్పీ

మరిపెడ: బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. మరిపెడ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బందికి సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలని చెప్పారు. మహిళా అధికారుల రెస్ట్‌రూం, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 100కు కాల్ రాగానే వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల పూర్తి వివరాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. తరచూ గ్రామాలను సందర్శించి సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, బాల్యవివాహలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ, వారి మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం పీఎస్ పరిసరాలలో ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ రఘు, మరిపెడ సీఐ సాగర్, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, అదనపు ఎస్సైలు మొగిలి, ఝాన్సీ, సీసీ చంద్రకాంత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ మార్చ్'ను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

మహబూబాబాద్ అర్బన్: వరంగల్‌లో ఈ నెల 15న జరగనున్న నిరుద్యోగ మార్చ్‌ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిరుద్యోగ మార్చ్ వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, అందులో జరుగుతున్న అక్రమాలపై నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. యువత, నిరుద్యోగులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. మధ్యాహ్నం 3గంటలకు కాకతీయ యూనివర్సిటీ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు వల్లబ్ వెంకటేశ్వర్లు, చీకటి మహేష్, ఉపాధ్యక్షుడు ఓర్సు పద్మావతి, కోశాధికారి శ్యామ్ సుందర్‌శర్మ, అసెంబ్లీ కన్వీనర్ మోసంగి మురళి, మహిళా అధ్యక్షురాలు ఇందూ భారతి, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి



వాహన పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్ అర్బన్: వాహనదారులు వాహనపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని జిల్లా రవాణా శాఖ ఎంవీఐ రమేష్ రాథోడ్, ఆర్టీసీ డీఎం విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయం ఎదుట ఆర్టీసీ, రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాలను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక లోడుతో సరుకులను తీసుకెళ్లొద్దన్నారు. ఆటోలు, టాటాఏస్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాలకు వేళాయె..

నేటి నుంచి అగ్ని మాపక వారోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్



జిల్లా కేంద్రంలోని అగ్ని మాపక కేంద్రం

మహబూబాబాద్: జిల్లాలో నేటి నుంచి ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించనున్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యవంతం చేయడం వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని సంబంధిత అధికారులు తెలిపారు.

జిల్లాలో రెండు ఫైర్ స్టేషన్లు..

జిల్లాలో మానుకోట పట్టణం, మరిపెడ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. ఈ రెండు కేంద్రాల్లో వారోత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు. అగ్ని మనకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని, దాని వినియోగంలో ఏమాత్రం పొరపాటు చేసినా భారీ ప్రమాదాలకు దారి తీస్తుందని వారోత్సవాల్లో ప్రచారం చేయనున్నారు. చిన్న నిప్పు రవ్వను నిర్లక్ష్యం చేసినా అది భయానక పరిస్థితులను సృష్టిస్తుందని, ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లుతుందని ప్రజలకు వివరించనున్నారు. అగ్ని మాపక శాఖ అగ్ని ప్రమాదాల సమయంలోనే కాకుండా వరదలు, రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, భూకంపాలు, వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా ప్రజలకు సేవ చేయడానికిసిద్ధంగా ఉంటారు. అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ తదితర అంశాలతో కూడిన కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

- 14వ తేదీన అగ్ని ప్రమాదాల్లో మృతి చెందిన ఫైర్ సిబ్బంది కుటుంబ సభ్యులను కార్యక్రమానికి ఆహ్వానిస్తారు. మృతి చెందిన సిబ్బందికి నివాళులర్పిస్తారు. ఎగ్జిబిషన్ ఏర్పాటుచేసి ఆ శాఖ ఆయుధాలు, సామగ్రిని ప్రదర్శించి వాటి పని తీరును వివరిస్తారు.
- 15న జన సంచారం ఎక్కువగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, రైల్వేస్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వాహనాల ద్వారా పలు విన్యాసాలు చేసి చూపుతారు.
- 16న ఆస్పత్రుల్లో అగ్నిప్రమాదాలపై అవగాహన, సిబ్బందికి శిక్షణ ఇస్తారు.
- 17న అపార్ట్‌మెంట్‌లలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తారు.
- 18న పెట్రోలు బంక్‌లు, గోదాంలు, గ్యాస్ గోదాంలు, పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తారు.
- 19న ఫంక్షన్ హాల్స్, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్‌లలో ప్రమాదాలపై అవగాహన, పలు విన్యాసాలు చేసి చూపుతారు.
- 20వ తేదీన వర్క్‌షాపు నిర్వహించి ప్రమాదాలపై సెమినార్‌తో పాటు విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు.

పోస్టర్ల ఆవిష్కరణ..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక, అధికారులు

కలెక్టర్ కార్యాలయంలో గురువారం అగ్నిమాపక వారోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కలెక్టర్ శశాంక చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వారోత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ నాగేశ్వర్‌రావు, లీడింగ్ ఫైర్‌మెన్ కృష్ణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

వారోత్సవాలకు ఏర్పాట్లు చేశాం..



అగ్నిమాపక వారోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తాం. అగ్ని ప్రమాదాలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.

– నాగేశ్వర్‌రావు, ఎస్ఎఫ్ఓ

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం



అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన అవసరం. వారోత్సవాల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. వారోత్సవాల్లో బాగంగా నిర్వహించే కార్యక్రమాలను ప్రజలు తిలకిస్తే ప్రమాదాలపై అవగాహన వస్తుంది.

– బి.కృష్ణ, లీడింగ్ ఫైర్‌మెన్

పీడీయాక్టు నమోదు



లక్ష్మణ్‌ను చర్లపల్లి జైలుకు తరలించిన డీటీఎఫ్ సీఐ బి.కృష్ణ, అధికారులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని సీత్లాతండా గ్రామానికి చెందిన ధరంసోత్ లక్ష్మణ్ అనే వ్యక్తిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేసి చర్లపల్లి జైలుకు తరలించామని ఎక్సైజ్ డీటీఎఫ్ కృష్ణ గురువారం తెలిపారు. కలెక్టర్ శశాంక ఉత్తర్వులు, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.కిరణ్‌నాయక్ ఆదేశాల మేరకు ధరంసోత్ లక్ష్మణ్‌పై చర్యలు తీసుకున్నామన్నారు. అతడిపై ఐదు ఎక్సైజ్ కేసులు నమోదు అయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

10మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పీజీ ఫైనలియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 10మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలి



జెండా గద్దె వద్ద నాయకులు

దంతాలపల్లి: వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కొండ నాగమల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఏమ్మార్సీ ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ పదో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగమల్లయ్య సంఘం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు, ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి టీఎస్ యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవి సెలవుల్లోనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ దంతాలపల్లి, నర్సింహులపేట మండలాల అధ్యక్షులు కొండ యాకన్న, మల్లయ్య, జిల్లా ఆడిట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పార్వతిరాథోడ్, వంశీకృష్ణ, కృష్ణ, చిరంజీవి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు షురూ...

మహబూబాబాద్ మున్సిపాలిటీ శివారు కాలనీల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆయా కాలనీలకు మిషన్ భగీరథ పైప్‌లైన్లు పూర్తి కాకపోవడం, ఇతర కారణాల వల్ల తాగునీరు అందడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సకాలంలో తాగునీరు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



నందినగర్‌లో నీళ్ల ట్యాంకర్ వద్ద బిందెలతో గుమిగూడిన ప్రజలు

విద్యుత్‌ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్పీడీసీఎల్‌ సీఎండీ గోపాల్‌ రావును కలిసి వస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్‌ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోషియేషన్‌ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌, అసోషియేషన్‌ డిస్కం కార్యదర్శి బక్క దానయ్య కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌ అతిథి గృహంలో గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ వెల్ఫేర్‌ అసోషియేషన్‌ డిస్కం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. సొంత ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్‌ యాజమాన్యం విద్యుత్‌ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బాబాసాహెబ్‌ అంబేడ్కర్‌ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, నూతన సచివాలయానికి అంబేడ్కర్‌ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్పీడీసీఎల్‌ సీఎండీ ఎ.గోపాల్‌ రావును కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసోషియేషన్‌ డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్‌ కుమార్‌, నాయకులు స్వదేశ్‌ కుమార్‌, లక్ష్మీనారాయణ, కృష్ణ, రవి, చలపతి, విజయ్‌ రాజ్‌, రాజు, శ్యామ్‌ కుమార్‌, రామకృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతుల గోస

అన్నదాతలకు లాట్‌ ఐడీలు ఇవ్వని సిబ్బంది
- జీరో దందా కోసమేనని ఆరోపణలు
- అడ్తిదారుల కనుసన్నల్లోనే మిర్చి అమ్మకాలు
- ప్రేక్షక పాత్రలో మార్కెట్‌ పాలకవర్గం

సాక్షి పరిశీలన



వరంగల్‌ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు.



లాట్‌ ఐడీ(నమూనా)

వరంగల్‌: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు పంటను అమ్ముకోవడంలో అండగా ఉండేందుకు మార్కెట్‌ కమిటీలు, రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేసి కన్వీనర్లను నియమిస్తున్నా.. వారు పెద్ద పెద్ద వాహనాల్లో అధికారదర్పం ఒలగబెటడమే కాని ఏనాడు మార్కెట్‌లో రైతుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్‌ వ్యవసాయ మార్కెట్‌ యార్డుల్లో గురువారం 'సాక్షి' పరిశీలించి లాట్‌ ఐడీలపై రైతులను ప్రశ్నించగా మెజార్టీ రైతుల నుంచి ఇవ్వలేదన్న సమాధానం వచ్చింది.

ప్రతిరోజూ 35నుంచి 50వేల బస్తాల మిర్చి

సీజన్‌లో మిర్చి బస్తాలను గ్రామాల నుంచి రైతులు ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకురావడంతో అలసిపోతున్నారు. అడ్తిదారుని గుమస్తాలు రాగానే తమ బస్తాలను ఆయనకు అప్పగించి కాలకృత్యాలు తీర్చుకోవడం, టీ, టిఫిన్‌ చేయడానికి వెళ్లిన సమయంలో అక్కడ జరిగే తంతును పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు మిర్చి ధరను నిర్ణయించేందుకు జెండా పాట పాడి గరిష్ట ధరకు ఒక లాట్‌ ఖరీదు దారుడు కొనుగోలు చేస్తారు. అనంతరం మార్కెట్‌లోని సేట్లు ఇంటికి, మార్కెట్‌ సిబ్బంది యార్డుల్లోకి, అధికారులు ఆఫీసుల్లోకి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మిర్చి దాదాపు ప్రతిరోజూ 35 నుంచి 50వేల బస్తాలు వస్తున్నాయి. యార్డుల్లోకి వచ్చిన మిర్చి బస్తాలు అప్పుడప్పుడు మాయం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా.. సీసీ కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల కెమెరాలు పనిచేస్తున్నందున కొన్ని బస్తాలు మాయమైన సందర్భంలో ఇరువర్గాలను సమన్వయం చేసి మార్కెట్‌ అధికారులు సమస్యను పరిష్కరిస్తున్న పరిస్థితి ఉంది.

జీరో దందాకు రాచమార్గం

రైతులకు లాట్‌ ఐడీలు జారీ చేస్తే తప్పనిసరిగా తూకం వేసి పీవోఎస్‌ మిషన్లలో ఎంటర్‌ చేయాల్సి ఉంటుంది. అందువల్ల జీరో దందాకు అవకాశం లేకుండా పోతుంది. దీంతో కొంత మంది ట్రేడర్స్‌, వారి గుమస్తాలు, మార్కెట్‌లోని కొంత మందితో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఐడీల జారీలో అలసత్వం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బంది లాట్‌ ఐడీలు ఇచ్చారా.. లేదా అన్న విషయాలను యార్డుల్లో అధికారులు తిరిగితే తెలుస్తుంది. అధికారులు మాత్రం యార్డు ఆఫీసులకే పరిమితం కావడంతో మొత్తం దడవాయిలు, హమాలీలు, గుమస్తాల కనుసన్నల్లోనే గుట్టుగా ఈ వ్యవహారం సాగుతున్నట్లుగా తెలిసింది.

లాట్‌ ఐడీల్లో అన్ని వివరాలు

రైతులు మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చి యార్డుల వద్ద పెట్టగానే మార్కెట్‌ సిబ్బంది లాట్‌ ఐడీలు తప్పకుండా జారీ చేయాల్సి ఉంటుంది. లాట్‌ ఐడీ ఇస్తే అందులో రైతు పేరు, అడ్తిదారుని పేరు, తెచ్చిన మిర్చి రకం, ఎంత సరకు తెచ్చారనే వివరాలు ఉంటాయి. కాంటాలు పెట్టే సమయంలో లాట్‌ ఐడీలో పేర్కొన్న బస్తాలు ఉన్నాయా..రకం ..ఇతరత్రా విషయాలను రైతులు గమనించే అవకాశం ఉంటుంది. మార్కెట్‌ ఉన్నతాధికారులు లాట్‌ ఐడీలు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న పాలకవర్గం ప్రేక్షకపాత్ర పోషించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లాట్‌ ఐడీలు ఇవ్వలేదు..



15 బస్తాల మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. నాకు లాట్‌ ఐడీ ఇవ్వలేదు. ధరలు అయ్యాయి. ఇంకా కాంటాలు కాలేదు. గత ఏడాదిలో ఒక సారి లాట్‌ ఐడీ ఇచ్చారు. ఈ సీజన్‌లో రెండు సార్లు మార్కెట్‌కు మిర్చి అమ్మేందుకు వచ్చినా ఐడీలు ఇవ్వలేదు.

\- యాకయ్య, లడాయిగడ్డ, కొత్తగూడ

అంతా సేటుకే ఎరుక..



46 బస్తాల సన్న మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ధర క్వింటాకు రూ.20,300లు అన్నారు. ఇంకా కాంటాలు కాలేదు. లాట్‌ ఐడీ ఇవ్వలేదు. మిర్చి బస్తాలు తెచ్చి సేటుకు అప్పగించడం వరకే తెలుసు. ఇవన్నీ ఏమి తెలియదు.

\- వీరన్న నాయక్‌, గోప్యాతండా,కేసముద్రం

ధర అడ్తిదారులకే తెలుసు..



మార్కెట్‌కు 8 బస్తాల మిర్చి తీసుకొచ్చాను. లాట్‌ ఐడీ ఇవ్వలేదు. అసలు ఎప్పుడూ కూడా లాట్‌ ఐడీలు ఇవ్వలేదు. మిర్చి బస్తాలు కాంటాలు కాలేదు. ధర కూడా అడ్తిదారులకే తెలుసు.

\- రాజఅయిలు, గొల్లపల్లి, గణపురం

బీజేపీ నిరుద్యోగ మార్చ్‌ హాస్యాస్పదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: తెలంగాణ అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు రేపు హనుమకొండలో నిరుద్యోగ మార్చ్‌ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లా పార్టీ కార్యదర్శులు, ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభజన హామీలు నెరవేర్చని కేంద్రాన్ని నిరుద్యోగులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇటీవల చేపట్టిన ప్రజాపోరు యాత్ర వల్లే కేంద్రంలో, రాష్ట్రంలో విభజన హామీలపై చర్చ మొదలైందన్నారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని కూడా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా 12రోజుల పాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ పార్టీ చేపట్టిన ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న 200 మంది నాయకులు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు విజయసారధి, నేదునూరి జ్యోతి, మేకల రవి, కర్రె భిక్షపతి, రాజారెడ్డి, రాజ్‌కుమార్‌, మల్లికార్జున్‌రావు, రమేష్‌, తోట భిక్షపతి, ఎల్లేశ్‌, ఆదరి శ్రీనివాస్‌, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'యువిక-2023'కి నిఖిల్‌ ఎంపిక

- అభినందించిన డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌



కాశోజీ సెంటర్‌: బాల్యదశలోనే సైన్స్‌, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఆసక్తి పెంచి విద్యార్థులను ఈ రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ వేసవి సెలవుల్లో చేపడుతున్న యువిక-2023 కార్యక్రమానికి వరంగల్‌ జిల్లా నెక్కొండ మండలంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థి బట్టు నిఖిల్‌ ఎంపికయ్యాడు. దేశ వ్యాప్తంగా కేవలం 9వ తరగతి విద్యార్థుల కోసమే ఏర్పాటు చేసిన ఈ యువిక (యువ విజ్ఞాన కార్యక్రమం)లో రెండు వారాల పాటు వచ్చే మే నెలలో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు వివిధ కేంద్రాల్లో మొత్తం 350 మంది విద్యార్థులకు స్పేస్‌ సైన్స్‌, స్పేస్‌ టెక్నాలజీలలో శిక్షణ ఇస్తారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో 350మంది విద్యార్థుల్లో 22వ ర్యాంకు సాధించి నిఖిల్‌ ఎంపిక కావడం పట్ల డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్‌ అధికారి డాక్టర్‌ కట్ల శ్రీనివాస్‌, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి నిఖిల్‌ను అభినందించారు. ఈ శిక్షణలో నిఖిల్‌కు అయ్యే పూర్తి ఖర్చులు ఇస్రో భరించనుంది.

ఎద్దు పొడిచి బీటెక్‌ విద్యార్థి మృతి

- మేతకు ఎడ్లను తీసుకెళ్లగా ఘటన



భానుప్రకాశ్‌(ఫైల్‌)



భానుప్రకాశ్‌ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: మేత మేపేందుకు తీసుకెళ్లిన ఎద్దు పొడవడంతో ఓ బీటెక్‌ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకరమైన ఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ పనికరి పద్మ, కొమురమల్లు దంపతులకు కుమారుడు భానుప్రకాశ్‌(19), కూతురు అలేఖ్య ఉన్నారు. భానుప్రకాశ్‌ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్‌ ఫస్టియర్‌ చదువుతున్నాడు. ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం ఇంటివద్ద ఉండగా, తమకున్న రెండు ఎడ్లను మేపేందుకు భానుప్రకాశ్‌ పంటచేను వద్దకు తీసుకెళ్లాడు. ఎద్దు మూతికి కట్టిన బుట్టి విప్పే క్రమంలో ఆ ఎద్దు ఛాతిభాగంలో పొడవడంతో అతను కింద పడిపోయి, గట్టిగా కేకలు వేశాడు. కొంత దూరంలో ఉన్న అతడి పెదనాన్న యాకమల్లు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చి భానుప్రకాశ్‌ను బైక్‌పై కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మహబూబాబాద్‌లోని మరో ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

కాలేజీకి వెళ్లినా బతికేటోడు..

బీటెక్‌ ఫస్టియర్‌ చదువుతున్న భానుప్రకాశ్‌ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లాలనుకున్నాడు. కొత్త డ్రెస్‌ కొనుక్కొని శుక్రవారం వెళ్లొచ్చని ఇంట్లో చెప్పడంతో ఇంటి వద్ద ఉండిపోయాడు. అతను ఒకవైపు చదువుకోవడంతోపాటు, తన వంతుగా వ్యవసాయ పనులను చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఈ మేరకు ఎడ్లను మేపేందుకు వెళ్లిన అతన్ని ఎద్దుపొడవడంతో మృతిచెందాడు. కాలేజీకి వెళ్లినా బతికేటోడివంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారందరిని కంటతడిపెట్టించింది. భానుప్రకాశ్‌ కుటుంబాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే బానోత్‌ శంకర్‌నాయక్‌ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరికోత మిషన్‌ నడపడానికి వెళ్లి..



ఆంజనేయులు(ఫైల్‌)

బచ్చన్నపేట: మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరికోత మిషన్‌ నడపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు సాగర్‌ కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుక్కసావు ఆంజనేయులు(40) డ్రైవింగ్‌ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల క్రితం ఏపీలోని ఎన్‌టీఆర్‌ జిల్లా గంపలగూడెం మండలం గొల్లపూడికి చెందిన ఏజెంటు చల్ల కృష్ణ ఇంటికి వరికోత మిషన్‌ నడపడానికి వెళ్లాడు. పనిలో భాగంగా గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం వద్ద వరికోతలు కోస్తున్నాడు. విరామ సమయంలో సాగర్‌ కాల్వపై స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ అందులో పడ్డాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో అండర్‌ టన్నెల్‌లో చిక్కుకుని శ్వాస ఆడక మృతి చెందాడు. ఈ సమాచారం మేరకు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన అనంతరం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతునికి భార్య మమత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ హెడ్‌ కానిస్టేబుల్‌..



హెడ్‌కానిస్టేబుల్‌ ప్రసాద్‌ (ఫైల్‌)

దామెర: చికిత్స పొందుతూ హెడ్‌ కానిస్టేబుల్‌ మృతిచెందాడు. ఈ ఘటన దామెర మండల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ హంటర్‌ రోడ్డుకు చెందిన గుగ్గిళ్ల ప్రసాద్‌ (53) ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్‌ హెడ్‌ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి విధులు ముగించుకొని హనుమకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గుంతలో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు దామెర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్‌ అవయవాలు జీవన్‌దాన్‌ ట్రస్ట్‌కు దానం చేశారు.

వడదెబ్బతో ఒకరు..



భిక్షపతి (ఫైల్‌)

నెక్కొండ: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన సంఘటన వరంగల్‌ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండకు చెందిన దేవులపల్లి భిక్షపతి (43) వడదెబ్బకు గురై వాంతులు, విరేచనాలు కావడంతో బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు సూచించడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భిక్షపతి మృతి చెందాడు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు భిక్షపతి మృతదేహాన్ని సందర్శించారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్‌

- రూ.10 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ రూరల్‌: మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలని స్నేహితుడి ఇంట్లో ఓ వ్యక్తి చోరీకి పాలపడ్డాడు. ఆ నిందితుడిని గురువారం పోలీసులు పట్టుకుని అరెస్ట్‌ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ సీతారాం వివరాలు వెల్లడించారు. బచ్చన్నపేట గ్రామానికి చెందిన సందెల రాజేష్‌(అలియాస్‌ రాజు) రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్నాడు. వచ్చే ఆదాయం సరిపోవక పోవడంతో చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. భవాని నగర్‌లో నివాసం ఉంటున్న రాజేష్‌ ఈ నెల 9వ తేదిన తన స్నేహితుడు వంశీ ఇంటి తాళం పగులగొట్టి రూ.10లక్షలు ఎత్తుకెళ్లాడు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా డీసీపీ సూచన మేరకు ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్‌, ఎస్సై రఘుపతి, సృజన్‌ సిబ్బందితో జనగామ బస్టాండ్‌ వద్ద నిందితుడిని పట్టుకొని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై రఘుపతి, సృజన్‌, సల్మాన్‌ పాషా, శ్రీనివాస రాజు, కానిస్టేబుళ్లు మహేష్‌, రామన్న, కర్ణాకర్‌, అనిల్‌కుమార్‌, కిరణ్‌కుమార్‌లను వారు అభినందించారు.

బట్టల దుకాణంలో షార్ట్‌ సర్క్యూట్‌

- సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ఎంపి గుప్తా రెడీమేడ్‌ బట్టల దుకాణంలో విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో స్వల్పంగా దగ్ధమైంది. దుకాణ యజమాని సోదరుడు అభిషేక్‌ అగర్వాల్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా గురువారం ఉదయం 10 గంటలకు దుకాణం తెరిచి మెయిన్‌ ఆన్‌ చేశారు. కొద్ది సేపటికే విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్‌ ఆన్‌ చేశారు. తిరిగి విద్యుత్‌ రావడంతో దుకాణంలోని మూడో అంతస్తులోని గోడౌన్‌లో మంటలు రావడాన్ని సిబ్బంది గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు నేతృత్వంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ నెలలో రంజాన్‌ పండుగ ఉండడంతో కొత్త స్టాక్‌ తెప్పించామని వివరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల ఆస్తినష్టం జరిగిందని అభిషేక్‌ అగర్వాల్‌ తెలిపారు.

పట్టుదలతో చదివితేనే బంగారు భవిష్యత్‌



మంత్రిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా సీజేఐటీ సిల్వర్‌ జూబ్లీ వేడుకలు

జనగామ: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని బంగారు భవిష్యత్‌ పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్‌ కళాశాలలో గురువారం రాత్రి బిషప్‌ ఉడుముల బాల అధ్యక్షతన జరిగిన సిల్వర్‌ జూబ్లీ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువును ఆషామాషీగా తీసుకుంటే, ఆగమైపోతారన్నారు. కళాశాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, బీటీ రోడ్డు సైతం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్‌ చదువుకునే విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులన్నారు. బిషప్‌ ఉడుముల బాల మాట్లాడుతూ సీజేఐటీలో 25 ఏళ్ల కాలంలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ప్రపంచంలోనే అనేక దేశాల్లో స్థిరపడ్డారన్నారు. కలెక్టర్‌ శివలింగయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సీజేఐటీ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. వరంగల్‌ నిట్‌ డైరెక్టర్‌ ఎన్వీ రమణారావు, జేఎన్‌టీయూహెచ్‌ రిజిస్ట్రార్‌ మంజూరు హుస్సేన్‌, సీజేఐటీ డైరెక్టర్‌ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్‌ కళాశాల్లో సీజేఐటీ ఒక్కటిగా నిలిచి పోతుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి, కలెక్టర్‌, ఎమ్మెల్యే, విద్యా వేత్తలను కాలేజీ నిర్వాహకులు శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ ప్రఫుల్‌ దేశాయ్‌, మునిసిపల్‌ ఛైర్‌పర్సన్‌ పోకల జమునలింగయ్య, కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవాల కన్వీనర్లు బి.స్వప్న, కరుణాకర్‌, ఏఎస్‌ రావు, ప్రణయ్‌ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్‌(ఫైల్‌)

నర్సంపేట రూరల్‌ : ఉరివేసుకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. ఎస్సై రవీందర్‌ కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణం వరంగల్‌ రోడ్డులోని ఆర్టీసీ కండక్టర్‌ రేసు శ్రీనివాస్‌ (51) నర్సంపేట డిపోలో విధులు నిర్వహించి కొన్ని సంవత్సరాల క్రితం తొర్రూర్‌ డిపోకు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. అయితే శ్రీనివాస్‌కు ఆరోగ్య స్థితి బాగలేక పోవడంతో విధులకు వెళ్లలేకపోతున్నాడు. ఈ క్రమంలో గత నెల 13న విధుల నుంచి తొలగించారు. దీంతో అనారోగ్య, విధుల నుంచి తొలగించడంతో మనోవేదనకు గురై శ్రీనివాస్‌ ఇంట్లో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.